సాక్షి
కుమురం భీం

గురువారం । 1 । మే । 2025



విత్తనపూజకు వేళాయె
జంగుబాయి అమ్మవారి పుణ్యక్షేత్రంలో విత్తన పూజకు ఆదివాసీలు సిద్ధమవుతున్నారు. నెలరోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. IIలో▸



పశుగ్రాసం పాట్లు IIIలో▸
వేసవిలో మూగజీవాలు పశుగ్రాసం కోసం అల్లాడుతున్నాయి. పశువుల కడుపు నింపడానికి అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
40.2 /27.6

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం తీవ్రస్థాయిలో వేడి, ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

'ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి'



నినాదాలు చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: ఛత్తీస్‌గఢ్‌లోని కర్రెగుట్ట ప్రాంతంలో చేపట్టిన ఆపరేషన్ కగార్ నరమేధాన్ని వెంటనే నిలిపివేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరుగుతున్న యుద్ధంలో అమాయకులైన ఆదివాసీలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మానవ హక్కులను హరిస్తున్నారని మండిపడ్డారు. మావోయిస్టులపై జరుగుతున్న హత్యాకాండను ఖండించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చందన్‌షా, నాయకులు భీమ్‌రావు, సుభాష్, కనక ప్రకాశ్, బాదిరావు, రామ్‌కిషన్ పాల్గొన్నారు.

జేఏసీ పోరాటాలకు టీబీజీకేఎస్ సంపూర్ణ మద్దతు



మాట్లాడుతున్న మల్రాజు శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): కాంట్రాక్టు కార్మికుల జీతాల పెంపు కోసం జేఏసీ ఆధ్వర్యంలో జరిగే పోరాటాలకు టీబీజీకేఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ సంఘం బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు తెలిపారు. గోలేటి టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్మికుల జీతాల పెంపుపై మేడే రోజు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. చాలా కాలంగా కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెరగకపోవడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎన్నికల సందర్భంగా కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు లేదా జీవో నంబర్ 22 ప్రకారం నెలకు రూ.25వేలు తగ్గకుండా అందేలా చూస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారిక కార్మిక వేడుకల్లో సీఎం కాంట్రాక్టు కార్మికులకు తీపి కబురు చెప్పాలని అన్నారు. కార్మికుల జీతాల పెంపుతోపాటు ఈఎస్ఐ వైద్య సౌకర్యం, 2022 సెప్టెంబర్ 26న సెంట్రల్ లేబర్ అధికారుల సమక్షంలో జరిగిన ఒప్పందంలోని అంశాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏరియా నాయకులు మారిన వెంకటేశ్, సెంట్రల్ కమిటీ నాయకులు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

30 పోలీసు యాక్ట్ కొనసాగింపు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో శాంతిభద్రతల రక్షణ, ప్రశాంతతను పెంపొందించేందుకు ఈ నెల 31 వరకు 30 పోలీసు యాక్ట్(1861) అమలులో ఉంటుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ డివిజనల్ పోలీసు అధికారి లేదా ఉన్నతాధికారుల అనుమతి లేకుండా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించొద్దన్నారు. కత్తులు, తుపాకులు, పేలుడు పదార్థాలు, ఇతర ఆయుధాలు కలిగి ఉండొద్దని, లౌడ్ స్పీకర్లు, డీజేలు వినియోగించడం నిషేధమని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షార్హులని పేర్కొన్నారు.

నీట్ సందేహాల నివృత్తికి కంట్రోల్ రూం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో నీట్ నిర్వహణ కోసం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 287 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. విద్యార్థులు సందేహాల నివృత్తి కోసం కంట్రోల్ రూం నంబర్ 63046 86505లో సంప్రదించాలని సూచించారు.

పదిలో మళ్లీ నిరాశ

- రాష్ట్రస్థాయిలో 32వ స్థానంలో జిల్లా
- 6,480 మంది విద్యార్థులకు 5,654 మంది పాస్
- వందశాతం ఉత్తీర్ణత సాధించిన పలు పాఠశాలలు



కెరమెరి: విజయ సంకేతం చూపుతున్న హట్టి ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి ఫలితాల్లో జిల్లాకు మళ్లీ నిరాశే ఎదురైంది. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఇతర జిల్లాలతో పోల్చితే వెనుకబడిపోయింది. గతేడాది రాష్ట్రస్థాయిలో 31వ స్థానంలో నిలవగా, 2024- 25 విద్యా సంవత్సరంలో జిల్లా 32వ స్థానానికి పడిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు పాఠశాలలకు సక్రమంగా హాజరు కాకపోవడం, రెగ్యులర్ డీఈవో లేకపోవడంతో ఆశించిన ఫలితాలు రాలేదు. పాఠశాలలపై పర్యవేక్షణ లేకపోవడం కూడా కారణమని తెలుస్తోంది. కొన్నేళ్లుగా ఇలాంటి ఫలితాలే పునరావృతమవుతున్నా.. విద్యాశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. రానున్న విద్యా సంవత్సరంలోనైనా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

5,654 మంది ఉత్తీర్ణత

జిల్లావ్యాప్తంగా 170 ఉన్నత పాఠశాలలు ఉండగా, 6,480 మంది విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 5,654 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 3,035 మంది బాలురు పరీక్షలు రాయగా, 2,539 మంది(83.66 శాతం) ఉత్తీర్ణత సాధించగా, 3,445 మంది బాలికలకు 3,115 మంది(90.42) పాసయ్యారు.

సత్తా చాటిన 'ప్రభుత్వ' విద్యార్థులు

పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, గురుకులాలు, కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు, గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ముందంజలో నిలిచారు. ఇక్కడ 99 మందికి 96 మంది ఉత్తీర్ణత నమోదు చేశారు. వర్షిత్ 600మార్కులకు 564 సాధించి జిల్లా టాపర్‌గా నిలవగా, సైయాద్ ఉమేజనజ్ 561 మార్కులు సాధించారు. స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బాలుర పాఠశాలలో 70 మందికి 96 మంది పాసయ్యారు. వరుణ్ 561 మార్కులు, కార్తీక్ 543 మార్కులు సాధించారు. జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో 69 మందికి 68 ఉత్తీర్ణులు కాగా, లిఖిత 556, అశ్విని 553 మార్కులతో స్కూల్ టాపర్లుగా నిలిచారు. గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 73 మందికి 72 మంది ఉత్తీర్ణత సాధించగా, అక్కిరెడ్డి ఐశ్వర్య 553, మాయావతి 552, కీర్తన 540 మార్కులు పొందారు. బాలుర సాంఘిక సంక్షేమ గురుకులంలో 75 మందికి 73 ఉత్తీర్ణులు కాగా, వంశీ 560, రోహన్ 541 మార్కులు సాధించారు. ఆసిఫాబాద్ కేజీబీవీలో 42 మందికి 41 మంది, ఆసిఫాబాద్ బాలికల ఉన్నత పాఠశాలలో 102 మంది 84 మంది పాసయ్యారు. బాలికల ఉన్నత పాఠశాలలో సాత్విక 541, తేజస్విని 522 మార్కులతో టాపర్లుగా నిలిచారు. బాలుర ఉన్నత పాఠశాలలో 94 మందికి 69 మంది, జన్కాపూర్ పాఠశాలలో 71 మందికి 59 మంది ఉత్తీర్ణులయ్యారు. మర్యాదాస్ 519, శంకర్ 511 మార్కులు సాధించారు. బూర్గుడ పాఠశాలలో 74 మందికి 55 మంది ఉత్తీర్ణులు కాగా, 487 మార్కులతో ఉమేష్, 476 మార్కులతో సాయివర్షిణి టాపర్లుగా నిలిచారు.



వర్షిత్(564)



సైయాజ్(561)



వరుణ్(561)



వంశీ(560)



లిఖిత(556)



ఐశ్వర్య (553)



మాయావతి (552)

ఇక్కడ వంద శాతం ఉత్తీర్ణత

జిల్లాలోని పలు పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత నమోదు చేశాయి. కెరమెరి మండలంలోని మోడి కేజీబీవీలో 16 మంది 16 మంది, మోడి ఉన్నత పాఠశాలలో 9 మంది 9 మంది, గోయగాం ఉన్నత పాఠశాలలో 35 మందికి 35 మంది, జైనూర్ కేజీబీవీలో 35 మందికి 35 మంది, చింతలమానెపల్లి మండలం డబ్బా ఉన్నత పాఠశాలలో 12 మందికి 12 మంది, బాబాపూర్ ఉన్నత పాఠశాలలో ఆరుగురికి ఆరుగురు, రెబ్బెన మండలంలోని తుంగెడ ఉన్నత పాఠశాలలో 16 మందికి 16 మంది, వాంకిడి కేజీబీవీలో 38 మందికి 38 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

నాలుగేళ్లుగా పదో తరగతి ఫలితాలు ఇలా..

విద్యా సంవత్సరం	విద్యార్థులు	ఉత్తీర్ణత	శాతం	రాష్ట్రస్థాయిలో స్థానం
2021-22	7,007	5,605	79	32
2022- 23	6,670	5,061	75	30
2023- 24	6,393	5,325	83	31
2024- 25	6,480	5,654	87	32

గిరిజన విద్యార్థుల సత్తా

- ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో 93.8 శాతం ఉత్తీర్ణత
- 13 స్కూళ్లలో వందశాతం ఫలితాలు



వందశాతం ఉత్తీర్ణత సాధించిన మోడి ఆశ్రమ ఉన్నత పాఠశాల

కెరమెరి(ఆసిఫాబాద్): గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. జిల్లాలో మొత్తం 36 ఆశ్రమ ఉన్నత పాఠశాలలు ఉండగా 13 పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత నమోదు చేశాయి. 1,170 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 1,089 మంది పాసయ్యారు. మొత్తం 93.8 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 508 మంది బాలురకు 467 మంది, 662 మంది బాలికలకు 622 మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాది 91 శాతం ఫలితాలు సాధించగా ఈసారి 93.8 శాతం సాధించి భేష్ అనిపించుకున్నారు. బంబారా, రొంపెల్లి, బాబాపూర్, కమ్మర్‌గాం, సోమిని, జైనూర్, మహాగాం, మోడి, అనార్‌పల్లి, మార్లవాయి, పోచంలొద్ది, కెరమెరి(హట్టి), రాంజీగూడ ఆశ్రమోన్నత పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణతతో ప్రభంజనం సృష్టించాయి. మిగిలిన 23 ఆశ్రమ పాఠశాలలు కూడా 90 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించాయి.

వందశాతం యాక్షన్ ప్లాన్ అమలు

వందశాతం యాక్షన్ ప్లాన్ అమలు చేయడంతోపాటు ఉదయం 5 నుంచి 7 వరకు, సాయంత్రం 7 నుంచి 10 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. నిత్యం గ్రాండ్ టెస్టులు, ఒక్కో సబ్జెక్టుల్లో 30 స్లిప్ టెస్టులు, సీ, డీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులను గుర్తించి రెమెడియల్ తరగతులు నిర్వహించడంతో ఉత్తమ ఫలితాలు సాధించగలిగామని గిరిజన సంక్షేమశాఖ డీడీ పి.రమాదేవి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి పుర్క ఉద్ధవ్ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో వచ్చే విద్యా సంవత్సరం వందశాతం ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు.

ప్రారంభోత్సవం విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

రెబ్బెన(ఆసిఫాబాద్): మంచిర్యాల జిల్లా నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు నిర్మించిన జాతీయ రహదారి ప్రారంభోత్సవం విజయవంతం చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద బుధవారం సభాస్థలి వేదిక నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ, మహారాష్ట్ర మధ్య రవాణాను మరింత మెరుగుపర్చేందుకు కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.3500 కోట్లతో నాలుగు వరుసలతో జాతీయ రహదారి నిర్మించిందని తెలిపారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీ చేతుల మీదుగా మే 5న కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద ఎన్‌హెచ్- 363 ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాతీయ రహదారుల సంస్థ రీజినల్ అధికారి శివశంకర్, ప్రాజెక్టు డైరెక్టర్ అజయ్ మణికుమార్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బసవేశ్వర మహరాజ్ జయంతి



నివాళులర్పిస్తున్న కలెక్టర్, నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో బసవేశ్వర మహరాజ్ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు బసవేశ్వర మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్, లింగాయత్ సంక్షేమ సంఘం ప్రతినిధులు దీకొండ సతీశ్‌కుమార్, వాసుదేవన గిరీశ్‌కుమార్, భద్రయ్య, సభ్యులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులకు సై

- జిల్లాలో నేటి నుంచి 10 శిబిరాల్లో శిక్షణ
- ఈ నెల 31 వరకు నిర్వహణ



శిక్షణకు సిద్ధమైన మైదానం

ఆసిఫాబాద్‌రూరల్/ఆసిఫాబాద్‌అర్బన్: సమ్మర్ క్యాంపులకు సమయం ఆసన్నమైంది. యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో పది శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. పది క్రీడాంశాల్లో గురువారం నుంచి నెలరోజులపాటు బాలబాలికలకు ఉచిత శిక్షణ అందించనున్నారు. మానసికోల్లాసం, దేహదారుఢ్యంపాటు స్నేహభావం పెంచేందుకు క్రీడలు ఉపయోగపడతాయని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో పది కేంద్రాలు

జిల్లాలోని మూడు మండలాల్లో పది శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం పది క్రీడాంశాల్లో పది మంది శిక్షకులను ఎంపిక చేశారు. వారికి కేటాయించిన క్రీడల్లో ఈ నెల 1 నుంచి 31 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. అవసరమైన క్రీడాసామగ్రి సైతం అందించనున్నారు. ఆసిఫాబాద్ మండలంలోని జన్కాపూర్, రాజంపేట్, బూర్గుడ, తిర్యాణి మండలంలోని రొంపెల్లి, తిర్యాణి, రాళ్లకన్నెల్లి, కాగజ్‌నగర్‌లోని బురదగూడ, సారండి, వెంపల్లి, నజ్రుల్‌నగర్‌లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో క్రీడానైపుణ్యం పెంచేందుకు శిక్షణ శిబిరాలు దోహదపడనున్నాయి. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 8:30 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందని సంబంధిత అధికారులు తెలిపారు. ఒక్కో కేంద్రంలో 40 మంది నుంచి 50 మంది విద్యార్థుల వరకు పాల్గొనేందుకు అవకాశం కల్పించారు.

శిక్షణ శిబిరాల వివరాలు

కేంద్రం	క్రీడ	కోచ్	ఫోన్ నంబర్
బూర్గుడ	నెట్‌బాల్	తిరుపతి	99493 00668
జన్కాపూర్	హ్యాండ్‌బాల్	అరవింద్	95509 09870
రాజంపేట్	ఖోఖో	తిరుమల్	80999 90509
తిర్యాణి	అథ్లెటిక్స్	లక్ష్మణ్	94923 24005
రొంపెల్లి	కబడ్డీ	సుభాష్	94415 87898
రాళ్లకన్నెపల్లి	వాలీబాల్	శ్రీనివాస్	93466 23235
బురదగూడ	షూటింగ్ బాల్	ఊర్వశి	95331 17323
సారండి	సాఫ్ట్‌బాల్	గురువేందర్	95331 17323
వేంపల్లి	బాక్సింగ్	శేఖర్	91771 12942
నజ్రుల్‌నగర్	కరాటే	బాపు	96522 15739

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో నిర్వహించే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. నెలరోజులపాటు పది క్రీడల్లో శిక్షణ అందిస్తారు. తల్లిదండ్రులు వారి పిల్లలను శిబిరాలకు పంపించాలి.
– మీనారెడ్డి, డీఎస్‌వో

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, పక్కన అదనపు కలెక్టర్ డేవిడ్

ఆసిఫాబాద్: నిషేధిత నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రావూరి శ్రీనివాస్‌తో కలిసి వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు, విత్తన విక్రయ డీలర్లతో వానాకాలం సంసిద్ధత, నిషేధిత పత్తి విత్తనాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మట్లాడుతూ వానాకాలం సీజన్‌లో జిల్లాలో 70 శాతం పత్తి సాగవుతుందని, రైతులకు కల్తీ, నిషేధిత పత్తి విత్తనాలు విక్రయించొద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నో ఆశలతో రైతులు పత్తి సాగు చేస్తారని, నకిలీ విత్తనాలు మొలకెత్తకపోతే ఆ కుటుంబం అప్పుల్లో కూరుకుపోతుందన్నారు. ప్రభుత్వ అనుమతి పొందిన, గుర్తింపు ఉన్న కంపెనీల విత్తనాలు మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. రైతులకు అవగాహన కల్పించాలన్నారు. విత్తనాలు, మందులు కృత్రిమ కొరత సృష్టించవద్దని, అధిక ధరలకు విక్రయించొద్దని సూచించారు. దుకాణాల యజమానులు విధిగా స్టాకు రిజిస్టర్, ధరల పట్టిక, రశీదు, రిజిస్టర్, ఈ- పాస్ మిషన్ నిర్వహించాలన్నారు. పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసి నకిలీ పత్తి విత్తనాల విక్రయాన్ని నియంత్రిస్తామని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ఏడీఏ మనోహర్, అధికారులు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి

ఆసిఫాబాద్: యాసంగి ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో యాసంగి ధాన్యం కొనుగోళ్లు, మిల్లులు, గోదాములకు తరలింపు, కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు, అకాల వర్షాలు, ఎండ తీవ్రత దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గోనె సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన మిల్లులు, గోదాములకు వెంటనే తరలించాలన్నారు. అకాల వర్షాలు, వడగాలులపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీఎంఆర్ డిఫాల్టర్ రైస్ మిల్లులపై చర్యలకు ఉపక్రమించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో 34 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. మే మొదటి వారంలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. బ్యాంకు గ్యారంటీ కల్పించిన మిల్లులకు సీఎంఆర్ బియ్యం పంపిస్తామని తెలిపారు. గత సీజన్ సీఎంఆర్ అందించని మిల్లులపై సమీక్షిస్తామని, సన్నబియ్యం పంపిణీ నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, పౌరసరఫరాల శాఖ అధికారులు నర్సింహస్వామి, వినోద్‌కుమార్, మార్కెటింగ్ శాఖ అధికారి అశ్వక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు జరిపిస్తే కేసులు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): నిర్ణీత వయస్సు రాకుండా బాల్యవివాహాలు జరిపిస్తే కేసులు నమోదు చేస్తామని డీసీపీవో బూర్ల మహేశ్ హెచ్చరించారు. మండలంలోని నారాయణపూర్‌లో ఓ మైనర్ బాలికకు వివాహం జరిపిస్తున్నట్లు సమాచారం రావడంతో.. బుధవారం జిల్లా బాలల సంరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది అదనపు కలెక్టర్ దీపక్ తివారి ఆదేశాల మేరకు గ్రామానికి వెళ్లి వివాహాన్ని అడ్డుకున్నారు. బాలికను కౌన్సెలింగ్ నిమిత్తం సఖి కేంద్రానికి తరలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు, పౌర సమాజం సహకరించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే బాల్య వివాహాల నిషేధ చట్టం- 2006 ప్రకారం రెండేళ్ల నాన్ బెయిలెబుల్ జైలు శిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధిస్తామని తెలిపారు. బాల్య వివాహాలు నిర్వహించినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, నాయకులు నాగేశ్వర్, అలీబిన్, రవీందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలు



వర్క్‌షాప్‌లో మహిళా ఉద్యోగులతో ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఏరియాలోని వర్క్‌షాప్‌లో బుధవారం మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఆ సంఘం గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి మాట్లాడుతూ సింగరేణి చరిత్రలో మేడే సందర్భంగా మహిళా ఉద్యోగులకు మొదటిసారిగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే గోలేటి సీహెచ్‌పీ, జీఎం కార్యాలయం, ఖైరిగూడ ఓసీపీల్లో పోటీలు నిర్వహించగా, అక్కడి మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. సింగరేణిలో పురుషులతో సమానంగా మహిళలు సత్తా చాటుకుంటున్నారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ అన్నిరంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కిరణ్‌బాబు, ఖైరిగూడ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మతిస్థిమితం లేక యువకుడి ఆత్మహత్య

కుభీర్: మండలంలోని హంపోలి గ్రామానికి చెందిన శెరె శ్రీకాంత్ (35) మతిస్థిమితం లేక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పి.రవీందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శ్రీకాంత్ గత కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతుండే వాడు. ఈక్రమంలో బుధవారం ఉదయం సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకు న్నాడు. మృతుడి సోదరుడు దిలీప్ ఫిర్యాదు తోకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లైంగికదాడికి యత్నించిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు

తానూరు: లైంగికదాడి యత్నించిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ భైంసా మేజిస్ట్రేట్ దేవేంద ర్‌బాబు బుధవారం తీర్పునిచ్చారు. ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి కథనం ప్రకారం..మండం లలోని వడ్గాం గ్రామానికి చెందిన దిలీప్ 2020 జనవరి 26న అదేగ్రామానికి చెందిన మహిళ ఇంటికి వెళ్లి లైంగిక దాడికి యత్నిం చాడు. బాధిత మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రాజన్న కేసు దర్యాప్తు చేశారు. కోర్టులో నిందితుడు నేరం రుజువు చేయడంతో మేజిస్ట్రేట్ ఈమేరకు తీర్పునిచ్చారని ట్రెయినీ ఎస్సై వెల్లడించారు.

గూడెంలో భక్తుల సందడి



సత్యదేవుణ్ని దర్శించుకుంటున్న భక్తులు

దండేపల్లి: అక్షయ తృతీయ సందర్భంగా గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయం లో బుధవారం భక్తుల సందడి నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. పలువురు భక్తులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతా లు నోముకున్నారు. గుట్టపై గల శ్రీఆంజనే యస్వామి ఆలయంలో 484 మంది భక్తులు హనుమాన్ దీక్ష మాలాధారణ చేసుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి శిక్షలు

మంచిర్యాలక్రైం: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి కె.నిరోష బు ధవారం వినూత్న శిక్షలు విధించింది. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా పట్టు బడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఐదుగురికి ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు ప్రభుత్వ ఆసుపత్రిని శుభ్రప ర్చాల్సిందిగా, మరో 7గురికి రూ.16 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శిక్ష ఖరారు చేసినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

గాదిగూడ తహసీల్దార్ బదిలీ.. ఉద్యోగ విరమణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ తహసీల్దార్ ఎస్.విజయానందం మంచి ర్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీసీఎల్ ఏ కమిషనర్ నవీన్ మిత్తల్ మంగళ వారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన సొం త జిల్లాలో రిపోర్ట్ చేసి బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. కాగా, విజయానందం స్థానంలో డీటీగా పనిచేస్తున్న చౌహాన్ విలా స్‌కు తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వులు జారీ చేశారు.

విత్తనపూజకు వేళాయె

- జంగుబాయి సన్నిధిలో ఆదివాసీల పూజలు
- ఆలయంలో రేపటి నుంచి నెలరోజులు ఉత్సవాలు



జంగుబాయి కొలువైంది ఇదే గుహలో



ఆలయంలో కొలువైన పోచమ్మ తల్లులు

కెరమెరి(ఆసిఫాబాద్): అనాదిగా వస్తున్న ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడ డంలో ఆదివాసీలు ముందుంటున్నారు. జూన్ 8న మృగశిరకార్తె ప్రవేశించనుండడంతో ఆదివాసీలు తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని మహరాజ్ గూడ అడవుల్లో కొలువైన జంగుబాయికి పుణ్యక్షే త్రంలో విత్తన పూజకు శ్రీకారం చుట్టారు. అక్కడి గుహలోకి వెళ్లి దీపం వద్ద పూజలు చేస్తారు. రావుడ్, పోచమ్మ, మైసమ్మకు విత్తనాలు చూపించి మొక్కి అమ్మవార్లకు నైవేద్యం చూపిస్తారు. విత్తన పూజల అనంతరం తమ పొలాల్లో విత్తనాలు నాటడం ప్రారంభిస్తారు. దీన్ని గోండి భాషలో 'మొహతుక్ 'అంటారు. అదేవిధంగా గిరి గ్రామాల్లో ఏటా జరిగే విత్తన పూజల ముందుగా జంగుబాయి అమ్మ వారికి విత్తనాలు చూపెట్టాక పొలాల్లో నాటడంతో అధిక దిగుబడి వస్తాయని భక్తుల నమ్మకం.

నేడు దీపోత్సవం

జంగుబాయి సన్నిధిలో గురువారం దీపోత్సవం, శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు నెల రోజుల పాటు నిర్వహిస్తారు. వివిధ గ్రామాలకు చెందిన మోళంలు తరలివచ్చి పూజలు చేస్తాయి. దుక్కిలతో దున్ని విత్తనాలు వేసేందుకు తమ పొలాలను రైతులు సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, కుమురం భీం జిల్లాలోనే ఆదివాసీలు అధికంగా ఉన్నారు.

దేవతలకు విత్తనాలను చూపిస్తారు

మే మాసంలో అన్ని గ్రామాల్లో గ్రామ పటేల్ ఇంట్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తారు. ఆదివాసీల కులదైవమైన పాటేరు అమ్మోరు, జంగుబాయి, గాంధారి కిల్ల, పద్మాల్‌పురి కాకో వద్దకు వెళ్లి విత్త నాలను చూపిస్తారు. అక్కడే దేవతల ఆశీర్వాదం తీసుకుని తిరుగుపయనమవుతారు. అనంతరం



రాహుడ్ దేవతలు

గ్రామంలో ఉన్న ఆకిపేన్, అమ్మోరు, పోచమ్మ వద్దకు వెళ్లి విత్తనాలతో పూజలు చేస్తారు. అదే రోజు రాత్రి 2.5 కిలోల జొన్నలతో గట్క తయారు చేసి ఆరగిస్తారు. అర్ధరాత్రి అడవికి వెళ్లి (కుమ్ముడ్) చెట్టు ఆకులను తీసుకువచ్చి డొప్పలు తయారు చేసి ఇళ్ల ల్లో ఇస్తారు. అందులో పూజ చేసిన విత్తనాలు వేస్తారు. ఈ కార్యక్రమంతా మృగశిర మాసానికి కొద్ది రోజుల ముందుగా నిర్వహిస్తారు.

విత్తన పూజలు(మొహతుక్)

విత్తన పూజ చేయాలన్న రోజు రైతు కుటుంబమం తా ఉదయాన్నే పొలం బాట పడుతారు. ఉదయం ఇంటిని శుభ్రం చేసి పేడతో అలుకు చల్లుతారు. పొలానికి వెళ్లాక జొన్నతో గట్కా తయారు చేసి కుల దైవంతోపాటు నేల తల్లికి సమర్పిస్తారు. అనం తరం పొలంలో విత్తనాలు చల్లి అరకకు ప్రత్యేక పూజలు చేసి విత్తనాలు నాటుతారు. గ్రామ పటేల్ ఇంటి ఎదుట మహిళలు సంప్రదాయ నృత్యాలు చేస్తారు. పురుషులు గిల్లిదండా ఆట ఆడుతారు. తర్వాత సహపంక్తి భోజనం చేస్తారు.

చంచి భీమల్ దేవుడి కల్యాణంతో..

ఆదివాసీల ఇష్టదైవమైన చంచి భీమల్ దేవుడి కల్యాణం సందర్భంగా ఏటా ఏప్రిల్, మే మాసంలో విత్తనాలను దేవుడికి చూపిస్తారు. ఆరోజు ఆదివాసీలు భీమల్ దేవుడికి సంప్రదాయ పూజలు చేస్తారు. అడవుల్లో లభించే ఆకులతో ఆరు డొప్ప లను తయారు చేస్తారు. అందులో అన్ని విత్త నాలను కలిపి భీమల్ దేవునికి చూపిస్తారు. అనం తరం వాటిని ఇళ్లకు తీసుకెళ్లి దాచి పెడ్తారు. ఆరోజు పిండి వంటలు చేసి ఆరగిస్తారు. మృగశిర కార్తె ప్రారంభంతో ఆ విత్తనాలను తమ పొలాల్లో చల్లు తారని పలువురు చెబుతున్నారు.

దేవతలకు చూపించాకే..



పొలాల్లో విత్తనాలు నాటే కొన్నిరోజుల ముందు కుల దేవత లకు వాటిని చూపిస్తాం . ప్రత్యేక పూజలు చేశాకే పొలానికి వెళ్లి జొన్నగట్కాను వండి ఆరగిస్తాం. నేలతల్లికి ప్రత్యేక పూజలు చేసి విత్తనాలు నాటడం ప్రారంభిస్తాం. – సలాం శ్యాంరావు, జంగుబాయి ఉత్సవ కమిటీ చైర్మన్

ఆచారాలు పాటిస్తున్నాం



ఆదివాసీలు ఆచారాలు, సంప్రదాయాలను పాటి స్తూ వస్తున్నారు. ఏళ్ల క్రితం నుంచి ప్రారంభ మైన విత్తన(మొహ తుక్) పూజలు ఇప్పుడు కూడా చేస్తున్నాం. పూజలు చేయందే విత్త నాలు నాటం.– పుర్క బాపూరావు, జంగు బాయి ఉత్సవ కమిటీ, ప్రచార కార్యదర్శి

తాత్విక ధోరణితో సమున్నత జీవితం

- 'జీవితమే ఒకపుస్తకం'గ్రంథ పరిచయ కార్యక్రమంలో సాహితీవేత్తలు
- జిడ్డు కృష్ణమూర్తి ఆంగ్లపుస్తకాన్ని అనువదించిన జిల్లాకవి



ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

నిర్మల్‌ఖిల్లా: తాత్విక ధోరణి ద్వారానే సమున్నత జీవితం సిద్ధిస్తుందని జిల్లాకు చెందిన పలువురు సాహితీవేత్తలు అభిప్రాయపడ్డారు. జిల్లాకేంద్రం లోని కావేరి ఫౌండేషన్ గ్రంథాలయంలో మంగళ వారం రాత్రి 'జీవితమే ఒక పుస్తకం'గ్రంథ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, అనువాదకర్త కె.మచ్చేందర్..ప్రపంచ తాత్వికవేత్త జిడ్డు కృష్ణమూ ర్తి ప్రసంగాల సమాహార గ్రంథం 'ది బుక్ ఆఫ్ లైఫ్'అనే ఆంగ్ల పుస్తకాన్ని తెలుగులోకి అనువదిం చారు. కార్యక్రమంలో పాల్గొన్న సాహితీవేత్తలు మాట్లాడుతూ రెండున్నరేళ్ల పాటు కష్టపడి ఈ గ్రం థాన్ని తెలుగులోకి అనువదించడం ప్రశంసనీయ మని కొనియాడారు. కావేరి ఫౌండేషన్ చైర్మన్ అప్పాల చక్రధారి, సాహితీవేత్తలు టి.సంపత్ కుమార్, నరసయ్య, రవీంద్రబాబు, తుమ్మల దేవ రావు, కృష్ణంరాజు, మునిమడుగుల రాజారావు, ఆకుల సుదర్శన్, అంబటి నారాయణ, అనిత, నాగ రంజని, నూకల విజయ్‌కుమార్, దీపక్, పోలీస్ భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి చరిత్ర కాలగర్భంలోకి..



దేవతమూర్తుల విగ్రహాలు



నాటి రాతి స్తంభాలు

కడెం:మండలంలోని బెల్లాల్ సమీపంలో గోదావరి, కడెం నది కలిసే ప్రాంతంలో 1200 ఏళ్ల క్రితం నాటి మల్లికార్జున స్వామి ఆలయ చరిత్ర కాలగర్భంలోకి కలిసిపోతుంది. ఆలయ గర్భంలో నిధులు, నిక్షేపా లు ఉన్నాయని వందల ఏళ్ల క్రితం ఆలయాన్ని, దేవతమూర్తుల విగ్రహాలను నాడు కొందరు ధ్వం సం చేశారు. ఈ క్రమంలో స్తంభాలు పడి ఓ వ్యక్తి మృతిచెందినట్లు పెద్దలు చెబుతున్నారు. పురాతన ఆలయాన్ని పరిరక్షించకపోవడంతో అనాటి చరిత్రా క ఆనవాళ్లు కనుమరుగవుతున్నాయి. విగ్రహాల త లభాగాలు లేకుండా పోగా, రాతిస్తంభాలు గోదా వరి ఒడ్డున కుప్పలుగా ఉన్నాయి. ప్రస్తుతం పురా తన ఆలయం ఉన్నచోట గ్రామానికి చెందిన వారు నూతన ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. 1200 ఏళ్ల క్రితం నాటి చరిత్రని, శివ సాహిత్యం పొందడా నికి ఆత్మహుతి చేసుకున్న వీరగల్లు విగ్రహంగా భావిస్తున్నట్లు తెలంగాణ చరిత్రబృందం కన్వీనర్ హరగోపాల్, రాజ్‌కుమార్ తెలిపారు.

అక్రమ కలప తరలిస్తున్న వ్యక్తికి రిమాండ్

ఆసిఫాబాద్‌అర్బన్/తిర్యాణి: అక్రమ కలపను తర లిస్తున్న వ్యక్తికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆసి ఫాబాద్ జిల్లా జడ్జి ఎంవి. రమేశ్ బుధవారం ఉత్త ర్వులు జారీచేశారు. తిర్యాణి రేంజ్ అధికారి శ్రీని వాస్ కథనం ప్రకారం.. మండలంలోని కోసర నుం చి ఆసిఫాబాద్ మీదుగా మంచిర్యాల జిల్లా ఐబీ తా ండూర్‌కు ఈనెల 28న అక్రమంగా కారులో టేకు కలపను తరలిస్తున్నట్లు సమాచారం అందింది. అటవీ అధికారులు ఆసిఫాబాద్ నుంచి కారును వెం బడించి తాండూర్ వద్ద పట్టుకున్నారు. కారులో 17 దుంగలు లభ్యం కాగా, వీటి విలువ రూ. 46,665 ఉంటుందన్నారు. ఐబీ తాండూర్‌కు చెందిన ఏలే శ్వరం తిరుపతిని అదుపులో తీసుకుని విచారించగా తనకు ఐబీలో వైభవ్ టింబర్ డిపోఉందని తెలి పాడు. తరచూ కోసరా గ్రామానికి చెందిన అజ్మీర గణపతి వద్ద అక్రమ టేకు కలపను తరలిస్తానని ఒప్పుకున్నాడు. అతన్ని కోర్టులో హాజరుపర్చగా ఈ మేరకు జడ్జి రిమాండ్ విధించారు. అయితే అజ్మీర గణపతి పరారీలో ఉన్నట్లు తెలిపారు. డిప్యూటీ రేం జ్ అధికారి ఇక్బాల్ మోహినొద్దీన్, సెక్షన్ అధికారు లు విజయప్రకాశ్, మహేందర్, బీట్ అధికారులు అనిల్, ప్రకాశ్, శ్రీకాంత్, సాదిక్ పాల్గొన్నారు.

నకిలీపత్రాల ఘటనపై ఎస్పీ సీరియస్

- ఉద్యోగాలు పొందిన 17 మంది..
- విచారణ అధికారిగా ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్
- కొనసాగుతున్న విచారణ

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లాలో నకిలీ నివాస ధ్రువీక రణ పత్రాలు సృష్టించి ఏకంగా 17 మంది ఉద్యో గాలు సాధించిన సంఘటన జిల్లాలో కలకలం రేపు తోంది. బీఎస్‌ఎఫ్‌లో 7, ఐటీబీపీలో 7, ఎస్‌ఎస్‌బీలో 1, సీఆర్పీఎఫ్‌లో 2 ఇద్దరు ఉన్నట్లు తెలుస్తోంది. బీఎస్‌ఎఫ్‌లో ఉద్యోగాలు సాధించిన ముగ్గురిపై ఇచ్చోడ, ఇంద్రవెల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమో దైన విషయం విధితమే. మరో 14 మంది నకిలీ పత్రాలతో ఉద్యోగాల్లో కొనసాగుతుండటంతో ఎస్పీ అఖిల్ మహాజన్ ఈఘటనను సీరియస్‌గా తీసుకున్నారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఆమె నేతృ త్వంలో ఇప్పటికే పోలీసులు విచారణ కొనసాగిస్తు న్నారు. రెండు రోజుల నుంచి మీ సేవ కేంద్రాలను తనిఖీలు చేసి నిర్వాహకులను విచారించారు. గత ఐదునెలల వ్యవధిలో ఇచ్చోడ మండలం ఇస్లాంన గర్ నుంచి నివాస ధృవీకరణ పత్రాల కోసం 180 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల యువకుల దరఖాస్తులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రిజెక్ట్ చేసిన తిరిగి ఒక్కక్కరు రెండు, మూడుసార్లు దరఖాస్తులు చేసు కోవడం వెనుక దాగి ఉన్న అసలు రహస్యం అంతు పట్టడం లేదు. ఏది ఏమైన నివాస ధ్రువీకరణ పత్రా లను మార్ఫింగ్ చేసి భద్రత దళాల్లో ఉద్యోగం పొం దడంపై జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. స్థానికంగా ఉండేవారి ఆధార్, రేషన్‌కార్డు పత్రాల తో దరఖాస్తు చేయడం, ఈ దిశగా పోలీసుల విచార ణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

ఉమెన్స్ హ్యాండ్‌బాల్ విజేత ఉమ్మడి ఆదిలాబాద్



కప్ అందుకుంటున్న ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు

- రన్నరప్‌గా రంగారెడ్డి జట్టు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగ రేణి హైస్కూల్ మైదానంలో మూడు రోజులు జరిగిన రాష్ట్రస్థాయి 54వ సీనియర్ మహిళల తెలం గాణ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు విజేతగా, రంగారెడ్డి జట్టు రన్నరప్‌గా నిలిచిం ది. బుధవారం ఫైనల్‌మ్యాచ్‌లో ఈ జట్లు తలపడ గా ఆదిలాబాద్ జట్టు 13, రంగారెడ్డి జిల్లా జట్టు 11 గోల్స్ వేసింది. మూడో స్థానంలో వరంగల్, నాలుగో స్థానంలో ఖమ్మం జట్లు నిలిచాయని, గెలిచిన జట్లకు నిర్వాహకులు షీల్డ్‌లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హ్యాండ్‌బాల్ అసోసియే షన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి జట్టు కోసం 20 మందిని ఎంపిక చేసి వరంగల్‌లో కోచింగ్ ఇస్తామన్నారు. గుజరాత్‌లోని బూజ్‌లో ఈనెల 21 నుంచి 27 వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు పాల్గొంటుందన్నారు. ఈ పోటీల్లో తెలంగాణ ఉమ్మడి 10 రాష్ట్రాల నుంచి 200 మంది క్రీడాకారు లు పాల్గొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్, టోర్నమెంట్ ఆర్గనై జర్ కాంపెల్లి సమ్మయ్య, కోశాధికారి రమేశ్‌రెడ్డి, గ్రౌండ్ ఇన్‌చార్జి నస్పూరి తిరుపతి పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి



నినాదాలు చేస్తున్న ఆటోడ్రైవర్లు

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆటోజేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ డిమాండ్ చేశారు. గతనెల 25న మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ప్రారంభించిన ఆ టో రథయాత్ర బుధవారం బెల్లంపల్లికి చేరుకు ంది. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు కట్టా రాంకుమార్, నా యకులు, ఆటో డ్రైవర్లు రథయాత్ర కు స్వా గతం పలికారు. బజారుఏరియా పురవీ.థుల మీదుగా రథయాత్ర, ఆటోలతో ర్యాలీ చేశారు. రథయాత్ర మే 27న హైదరాబాద్‌కు చేరుకుం టుందని, ఈసందర్భంగా ఇందిరాపార్కులో ని ర్వహించే ఆటో ఆకలి కేకలు మహాసభకు ఆటో డ్రైవర్లు తరలిరావాలని కోరారు.

గుండెపోటుతో ట్రెయినీ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మృతి



రామళ్ల సాగర్ (ఫైల్)

భీమారం: మండల కేంద్రానికి చెందిన రామళ్ల సాగర్ ట్రెయినీ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృ తిచెందాడు. అతని బంధువులు తెలిపిన వివరాలు.. కొన్నినెలల క్రితం సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికైన సాగర్ (29) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురంలో శిక్షణ పొందుతున్నాడు. శిక్షణలో భాగంగా కాలికి దెబ్బతగలంతో వైద్యులు విశ్రాంతి తీసుకోవాలనడంతో గతనెల 26న స్వగ్రామానికి వచ్చాడు. బంధువుల వివాహం ఉండటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలసి బుధవారం మంచిర్యాలకు వెళ్లాడు. అక్కడ ఒక హోటల్ వద్ద కూర్చున్న సాగర్ అకస్మాత్తు గా కిందపడిపోయాడు. వెంటనే గమనించి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిం చారు. అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. సాగర్ మృతితో భీమారంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


గుండెపోటుతో సింగరేణి కార్మికుడు మృతి

బెల్లంపల్లి: బెల్లంపల్లి రడగంబాల బస్తీకి చెందిన మారెపల్లి రవీందర్ రెడ్డి (56) శాంతిఖని సింగరేణి కార్మికుడు గుండెపోటుతో మృతిచెందాడు. టూటౌన్ ఎస్సై కె.మహేందర్ కథనం ప్రకారం..భార్య, పిల్లలు ఊరికి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న రవీందర్ రెడ్డి మంగళవారం రాత్రి భోజనం చేస్తూ కుర్చీలో కుప్పకూలిపోయాడు. బుధవారం ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన పార్సిల్ రావడంతో విషయాన్ని భర్తకు చెప్పడానికి భార్య మంజు పలుమార్లు ఫోన్ చేసింది. లిఫ్ట్ చేయకపోవడంతో సహచర కార్మికుడికి ఫోన్ చేసి ఓసారి ఇంటికి వెళ్లి చూడా లంది. అతను వెళ్లి ఇంటి కిటికీ నుంచి చూడగా కుర్చీలో రవీందర్ రెడ్డి బిగుసు కుపోయి ఉన్నట్లు గుర్తించాడు. చుట్టుపక్క ఇళ్ల వారిని పిలిచి తలుపు పగుల గొట్టి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. కుటుంబ సభ్యులకు ఆయన సమా చారమిచ్చారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గేదెల మృతి కారకుడికి 9 నెలల జైలు

ఆసిఫాబాద్: విద్యుత్ తీగలు అమర్చి, నాలుగు గేదెల మృతికి కారణమైన తిర్యాణి మండలం చెలిమెల కొలాంగూడకు చెందిన టేకం కొండుకు 9 నెలల జైలుశిక్ష విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ బుధ వారం తీర్పుచెప్పారు. తిర్యాణి ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. తిర్యాణి నుం చి మాణిక్యాపూర్ వెళ్లే మార్గంలో గుట్టమేడి అటవీ ప్రాంతంలో జంతువుల కోసం టేకం కొండు విద్యుత్ తీగలు అమర్చాడు. గ్రామానికి చెందిన కుర్రిసం గ భీమ్‌రావు, ఆత్రం భుజంగరావు, మడావి సోంబాయి, బొమ్మగోని విజయ లకు చెందిన నాలుగు గేదెలు 2017 మే 31న మేతకు వెళ్లి తిరిగి రాలేదు. ఈక్ర మంలో అటవీప్రాంతంలో గాలించగా విద్యుత్ తీగలు తగిలి మృతిచెంది ఉన్నాయి. బాధితుల ఫిర్యాదుతో అప్పటి ఎస్సై బుద్దేస్వామి కేసు నమోదు చేశారు. రెబ్బెన సీఐ బుద్దేస్వామి, తిర్యాణి ఎస్సై శ్రీకాంత్ కోర్టులో సాక్షులు ప్రవేశపెట్టగా పీపీ జనన్మోహన్ రావు విచారించి నేరం రుజువుచేశారు. ఈ మేరకు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కోర్టు లైజనింగ్ అధికారి రాంసింగ్, కానిస్టేబుల్ వినోద్, పోలీసు అధికారులను ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

మూడు కిలోమీటర్లు వెళ్తేనే నీరు



ఇంద్రవెల్లి మండలంలోని తేజాపూర్ పంచాయతీ పరిధిలోని సాలేగూడలో నీటి కోసం గ్రామస్తులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. గ్రామశివారులో వ్యవసాయ బోరు బావుల నుంచి, ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం బోరుబావులు అడుగంటడంతో నీళ్లు రావడం లేదు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గ్రామానికి 3 కి.మీ దూరంలో సిరికొండ మండలం రాంపూర్‌కు బైక్‌లు, ఎడ్లబండ్లపై నీటిని తెచ్చుకుంటు న్నారు. కలెక్టర్ రాజర్షి షా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్పందించి గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. – ఇంద్రవెల్లి

ఆశ్రమ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు



అభినందిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. బుధవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తన క్యాంపు కార్యాలయంలో డీడీ అంబాజీ, ఏసీఎంవో జగన్‌ను అభి నందించారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈసారి 96 శాతం ఫలితాలు సాధించినట్లు ఏసీఎంవో జగన్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 108 పాఠశాలలు, అందులో 65 పాఠశాలలు వంద శాతం వచ్చాయని పేర్కొన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పదిలో ఉత్తమ ఫలితాలు సాధనకు ఐటీడీఏ పీవో సారథ్యంలో చేపట్టిన మిషన్ లక్ష్యం ఎంతో మేలు చేసిందన్నారు. వచ్చే ఏడాదిలో పదిలో వందశాతం ఫలితాలు సాధించేలా కృషిచేయా లని ఐటీడీఏ పీవో పేర్కొన్నారు.